క్లుప్తంగా

నేడు గూటాలలో వైఎస్సార్ సీపీ ప్రచారం

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని గూటాల పంచాయతీ పరిధిలోని గూటాల, మహాలక్ష్మీదేవిపేట, కొత్తపట్టిసీమలో గురువారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రచారం చేయనున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తెలిపారు.

పింఛన్ల పంపిణీ



బ్యాంక్ అకౌంట్ లేని వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

కుక్కునూరు: బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ కార్డ్ లింక్ కాని పింఛన్‌దారులకు బుధవారం సచివాలయ సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 944 మంది లబ్ధిదారులకు ఇంటి వద్ద పింఛన్‌ను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన పింఛన్‌దారులకు వారి ఖాతాల్లో సొమ్ము జమ అవుతోందన్నారు. పింఛన్ సొమ్ము ఖాతాల్లో జమ కాకపోతే వారి జాబితా గురువారం ఎంపీడీఓ కార్యాలయానికి అందగానే వారికి కూడా ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తామని ఎంపీడీఓ నరసింహారావు చెప్పారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన పాతూరు నవీన్ దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు విరాళం బాండ్ పత్రాన్ని అందించి, అభినందించారు.

ఘనంగా ధ్వజారోహణం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథవేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజారోణ వేడుక బుధవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఈ వేడుకను భక్తుల గోవింద నామస్మరణ నడుమ అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో కల్యాణ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమం నిమిత్తం యాగశాలలో ధ్వజపటంపై గరుత్మంతుని చిత్రపటాన్ని అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో లిఖించారు. పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ధ్వజపటానికి హారతులిచ్చి, దానిని ధ్వజస్తంభంపై ఎగురవేశారు. శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాలను వీక్షించేందుకు సర్వాది దేవతలను ఆహ్వానించే క్రమంలో ఈ ధ్వజారోహణ తంతును అర్చకులు నిర్వహించారు.

రాగి తీగ చోరీ

జంగారెడ్డిగూడెం: ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం గత నెల 29న రాత్రి మండలంలోని పట్టిన్నపాలెం జగనన్న హౌసింగ్ కాలనీలోని 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై తాడువాయి ఎలక్ట్రికల్ ఏఈ సందక శ్రీనివాసులు ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం

జంగారెడ్డిగూడెం: కత్తితో దాడిచేసిన ఘటనలో యువకుడు గాయపడ్డాడు. బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వసంతాటి కార్తీక్ స్థానికంగా ఉన్న ఓ రెస్టారెంట్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం బుట్టాయగూడెంకు చెందిన యువతిని కార్తీక్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. కార్తీక్ తల్లిదండ్రులు వివాహాన్ని అంగీకరించడంతో భార్యతో కలిసి జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి కార్తీక్ ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో కొందరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి కార్తీక్‌పై కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో కార్తీక్ మెడపై తీవ్ర గాయమైంది. స్థానికులు, స్నేహితులు స్థానిక ఏరియా ఆసుపత్రికి కార్తీక్‌ను తరలించారు. ఘటన వివరాలు తెలుసుకున్న డీఎస్పీ యు.రవిచంద్ర ఆసుపత్రికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బుట్టాయగూడానికి చెందిన నందిపాము రాంబాబు కుమార్తెను తన కొడుకు ప్రేమ వివాహం చేసుకోవడంతో ఆ కోపంతోనే ఆమె తండ్రి, సోదరుడు, మరికొంతమందితో వచ్చి కత్తితో దాడి చేశారని కార్తీక్ తల్లి రాణి ఆరోపించింది.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

చింతలపూడి: చింతలపూడి మండలం తమ్మిలేరు సమీపంలోని వాటర్ ప్రాజెక్టు సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చాట్రాయి మండలం, కోటపాడు గ్రామానికి చెందిన మోనూరి దుర్గారావు(30) భార్యతో కలిసి అంకాలంపాడు వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సుధాకర్, ఎస్సై కుటుంబరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పోలవరం నియోజకవర్గంలో.. ప్రగతి పరుగు

- మారిన గ్రామాల రూపు రేఖలు
- అబ్బురపరుస్తున్న అభివృద్ధి పనులు
- ఆధునిక వసతులతో ప్రభుత్వ బడులు, ఆసుపత్రులు
- ప్రజలు ముంగిటకే ప్రభుత్వ సేవలు
- అర్హులందరికీ అందుతున్న సంక్షేమ ఫలాలు

బుట్టాయగూడెం: ఒకప్పుడు అన్ని రంగాల్లో వెనుకబడిన పోలవరం (ఎస్టీ) నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రగతి పరుగులు తీస్తోంది. గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిన ప్రాంతం నేడు మారిన రూపురేఖలతో అబ్బురపరుస్తోంది. గతంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలు నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పాఠశాలల రూపంమారి కొత్త ఒరవడితో కార్పొరేట్ హంగులతో అలలారుతున్నాయి. నాడు కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వాస్పత్రులు నేడు ఆధునిక పరికరాలతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో నూతన సచివాలయ భవనాలు, విలేజ్ క్లీనిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలతో కళకళలాడుతున్నాయి.

నియోజకవర్గంలో రూ. 665.77 కోట్లు అభివృద్ధి పనులు

నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ. 665.77 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. వీటిలో నాడు- నేడు పథకంలో సుమారు 153 ప్రభుత్వ పాఠశాలలను రూ. 50.69 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.47.08 కోట్లతో సచివాలయాలు, రూ.23.50 కోట్లతో 107 రైతు భరోసా కేంద్రాలు, రూ.14.40 కోట్లతో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు మొత్తం రూ. 84.94 కోట్లతో నూతన భవనాల నిర్మాణాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.



అంతర్వేదిగూడెంలో నాడు-నేడులో అభివృద్ధి చేసిన గిరిజన సంక్షేమ పాఠశాల

అర్హులకు సంక్షేమ పథకాల ద్వారా జమ అయిన సొమ్ము రూ 923.14 కోట్లు

నియోజకవర్గంలో సుమారు రూ. 923.14 కోట్లతో అర్హులకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. జగనన్న దీవెన పథకంలో 5,016 మంది విద్యార్థులకు రూ. 26.16 కోట్లు జగనన్న వసతిదీవెనలో 4,326 మంది విద్యార్థులకు రూ.12.50 కోట్లు ఆసరా పథకంలో 59,170 మంది గ్రూప్ సభ్యులకు రూ.176.76 కోట్లు, వైఎస్సార్ పింఛను కానుక 42,410 మంది లబ్ధిదారులకు రూ. 444.85 కోట్లు, వైఎస్సార్ భరోసా పథకంలో 40,570 మంది రైతులకు రూ. 93.33 కోట్లు, అమ్మ ఒడి పథకంలో 89,220 మంది తల్లులకు రూ. 133.83 కోట్లు, వైఎస్సార్ చేయూత 18,557 మందికి రూ. 58.14 కోట్లు, జగనన్న తోడు పథకంలో 8,516 మంది చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాల కింద రూ. 2.5 కోట్లు, కాపు నేస్తం పథకంలో 3,776 మందికి రూ.9.09 కోట్లు, వాహన మిత్ర పథకంలో 1,367 మందికి రూ. 3.20 కోట్లు చొప్పున జమ చేశారు.



మర్లగూడెంలో బెంచీలపై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

అందుబాటులో సేవలు

సచివాలయాల్లో సుమారు 545 మౌలిక సేవలు అందుబాటులో ఉన్నాయి. అందులో 400 వరకూ గ్రామ స్థాయిలోని ప్రజలకు సేవలు అందుతున్నాయి. వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే సర్టిఫికెట్లు వచ్చి చేరుతున్నాయి. జగనన్నకు చెబుదాం ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారమవుతున్నాయి.



పోలవరంలో నిర్మించిన సచివాలయం



బుట్టాయగూడెం మండలం సీతప్పగూడెంలో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్



గిరిజన గ్రామం రెడ్డికోపల్లికి నిర్మించిన రహదారి



బుట్టాయగూడెం మండలం రాస్పగూడెంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్



రెడ్డిగణపవరంలో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రం

ఆనందంగా ఉంది



సచివాలయ వ్యవస్థ ద్వారా మాకు చాలా వెసులుబాటు దొరికింది. గతంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే మండల కేంద్రానికి పరుగులు తీసేవాళ్లం. ఇప్పుడు అన్ని సేవలు మా గ్రామంలోనే అందుతున్నాయి. జగనన్న తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ చాలా బాగుంది.

– ఎం. రాములు, రైతు, మారేడుబాక, కుక్కునూరు మండలం

ఆర్‌బీకే సేవలు భేష్



రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఎరువుల కోసం పరుగులు పెట్టేవారు. ఇప్పుడు అందుబాటులోనే ఇస్తున్నారు. ఈ-పంట నమోదు చేస్తున్నారు. విత్తనాలు అందించడంతోపాటు పంటలపై అవగాహన కల్పిస్తున్నారు.

– సిద్దిన వెంకటరత్నం, రైతు, పోలవరం

నియోజకవర్గంపై సీఎం జగనన్న ప్రత్యేక దృష్టి



గతంలో ఎన్నడూలేని విధంగా పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గిరిజన నియోజకవర్గంపై సీఎం జగనన్న ప్రత్యేక దృష్టి పెట్టారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కృషి చేస్తున్నారు. సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలతో ప్రజలకు సేవలు గ్రామ స్థాయిలోనే అందుతున్నాయి.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

చంద్రబాబుకు సీఎం అయ్యే అర్హత లేదు



ద్వారకాతిరుమల: వెంకటకృష్ణాపురంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న తానేటి వనిత

ద్వారకాతిరుమల: నలభై ఏళ్ల అనుభవం, 14 ఏళ్ల సీఎం అని చెప్పుకునే దగాకోరు చంద్రబాబుకు మరోసారి ముఖ్యమంత్రి అయ్యే అర్హత లేదని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. మండలంలోని వెంకటకృష్ణాపురం, రామన్నగూడెం, దేవినేనివారిగూడెంలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. వనిత విజయం కాంక్షిస్తూ దేవినేనివారిగూడెంలోని ఎస్సీ కాలనీ వాసులు అక్కడి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇటీవల రామన్నగూడెంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వాసంశెట్టి సత్యన్నారాయణ, దేవినేనివారిగూడెంకు చెందిన పాకలపాటి కిషోర్ కుటుంబాలను మంత్రి వనిత పరామర్శించారు. అనంతరం బైక్ ర్యాలీలో ఆమె స్కూటీ నడిపి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014 మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను టీడీపీ ఒక్కటి కూడా అమలు చేయలేదని, ఇప్పుడు మళ్లీ ఆచరణకు సాధ్యం కాని హామీలను గుప్పించి ప్రజలను వంచించేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, ఘంటా విఘ్నేశ్వరరావు, యలమర్తి గాంధి, సర్పంచ్ కామిరెడ్డి శ్రీను, చెరుకూరి ప్రసాదరావు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఆచంట బన్ను, నార్ని నాగన్న, పాకలపాటి భాస్కరరావు, కొత్తపల్లి రమేష్, ముక్క రామన్న, పెండ్లి శ్రీను, విజయ్, కేతా కోటేశ్వరరావు, జిత్తుక వెంకటేశ్వరరావు, జిత్తుక కొండయ్య, యోహాను, యాదాల శ్రీను, మల్లయ్య, నాగార్జున, షేక్ భాషా, మల్లెపూడి నాగమణి, పెద్దిన దిలీప్, దాసరి రాంబాబు, నల్లూరి బాపనయ్య, మానుకొండ కన్నయ్య, పీవీ బ్రదర్స్, ఘంటా శ్రీను, గుమ్మడి శ్రీను తదితరులున్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

కుక్కునూరు: మండలంలో అటవీ ప్రాంతం నుంచి తెలంగాణకు అక్రమంగా రూ.60 వేల విలువైన కలపను తరలిస్తుండగా కుక్కునూరు అటవీ శాఖాధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. డీఆర్‌ఓ కేసరి చెప్పిన వివరాల ప్రకారం, బుధవారం ఉదయం మారేడుబాక వద్ద వ్యానులో నకిర జాతికి చెందిన కలపను తరలిస్తుండగా పట్టుకుని వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఈ కలపను అమరవరం రేంజ్ అటవీ ప్రాంతం నుంచి సేకరించి తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం

కొయ్యలగూడెం: కుళ్లు కుతంత్రాలతో టీడీపీ, జనసేన పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలోని పలు గ్రామాల్లో ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. సరిపల్లి పంచాయతీ పరిధిలోని ధర్మారావుపేట, వంకా బొత్తప్పగూడెం, మర్రిగూడెం, దిప్పకాయలపాడు పరిధిలోని గొల్లగూడెం, బిల్లిమిల్లిలో ఆమె ప్రచారం చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టోను ముట్టుకోవడానికి కూడా బీజేపీ నాయకులు ఇష్టపడడం లేదని, అందులో పేర్కొన్న అబద్ధాలను అమలు చేయడం తమ వల్ల కాదు అని ఆ పార్టీ రాష్ట్ర నేతలే బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని రాజ్యలక్ష్మి అన్నారు. కొయ్యలగూడెంలో నిర్వహించిన విజయభేరి సభలో నేర చరితులను, మోసగాళ్లను పక్కన పెట్టుకొని దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ ప్రసంగించడం విడ్డూరంగా ఉందన్నారు. వాడవాడలా బాలరాజు దంపతులకు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచులు సున్నం శాంతి కుమారి, గేలం త్రివిక్రమ సోమరాజు, లింగిశెట్టి అనంతలక్ష్మి, సొసైటీల చైర్‌పర్సన్‌లు మందపాటి శ్రీదేవి, గొడ్డటి రాణి, బండి సీతారత్నం, కురసం మురళి, నూనె నాగు, గిద్దే సూర్యచంద్రం, దూలపల్లి కాంతారావు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం మండలం సరిపల్లిలో ఎస్టీ మహిళల గోడును ఆలకిస్తున్న రాజ్యలక్ష్మి

కృష్ణాపురంలో ఎన్నికల ప్రచారం

టి.నరసాపురం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణాపురంలో బుధవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ భూక్యా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ జరబల పూర్ణయ్య, భూక్యా వేణుగోపాల్, భూక్యా సత్యం, మాజీ వార్డు సభ్యులు శ్రీరాములు, భూక్యా మంచా వెంకటేశ్వరరావు, తేజవత్ వెంకన్న పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో ఇంటికే సంక్షేమ పథకాలు

కామవరపుకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో లబ్ధిదారులకు ఇంటికే సంక్షేమ పథకాలు అందాయని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలో కామవరపుకోటలో ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ సర్పంచ్ కర్రిపోతూ అనూష, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, రాష్ట్ర ముదిరాజ్ సంఘం డైరెక్టర్ చిక్కుళ్ళ శ్రీను, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, మేడంకి పద్మ, బొల్లు వెంకట సత్యనారాయణ, పోలిమెట్ల ప్రశాంత్, ఎస్కే కరిముల్లా, తమ్మిశెట్టి సుబ్రమణ్యం, మెరుగు బాబురావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో ప్రచారం

జంగారెడ్డిగూడెం: జగన్‌మోహన్‌రెడ్డి బలపర్చిన అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రజలను కోరారు. జంగారెడ్డిగూడెం 12, 14వ వార్డులో పార్టీ శ్రేణులతో ఆమె గడపగడపకు ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య ఆధ్వర్యం వహించారు. సీఎం జగన్ బలపర్చిన ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, మేడవరపు విద్యాసాగర్, రాష్ట్ర మహిళా సెక్రటరీ సార తులసీరెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్‌అక్బర్, బూత్ కన్వీనర్లు తాతకుంట్ల రవికుమార్, సాబోలు రవి, ఏలూరు జిల్లా జేసీఎస్ కన్వీనర్ చింత అనిల్ కుమార్ గౌడ్, ఏలూరు జిల్లా వైస్సార్‌సీపీ కార్యవర్గ సభ్యులు గెద్దాడ శ్రీను, కౌన్సిలర్లు షేక్ రహీమ, తాతకుంట్ల నాగవెంకటలక్ష్మి, నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, తడికమళ్ల మురళి, ఎల్‌వీఆర్, డి.ధనలక్ష్మి, కంచర్ల గీతాకుమారి, కనుమూరి లావణ్య, కో-ఆప్షన్ సభ్యులు వెంప ఐజీ, నాయకులు చలమాల శ్రీను, బత్తిన చిన్న, ముప్పిడి శ్రీను, చిప్పాడ వెంకన్న, అడపాల రాంబాబు, చిన్న టీటీడీ దేవస్థానం డైరెక్టర్ వాస రామకృష్ణ, ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ భావన ఋషి, మహమ్మద్ హఫీజ్, షేక్ అమీర్, మహమ్మద్ కబీర్, కంచర్ల విష్ణు, వీరవెల్లి సోమేశ్వరరావు, చింతపల్లి కవి, బోను ప్రసాద్, కంచుమర్తి ప్రకాష్, తల్లాడ శ్రీను, పంది రాజా, సాభోలు రవి, షేక్ రఫీ, కూనపాము పండు, మల్లవరపు నాగపాసు, కసింకోట సతీష్, ఉడ నాగేంద్ర, కంచర్ల నాగేశ్వరరావు, మేడపాటి రమేష్ రెడ్డి, తాడేపల్లి ఉమాదేవి, దోనేపూడి విజయ్ కుమారి, బోను ప్రసాద్, మల్లిపూడి రవి, దోనేపూడి రమణ, కాసర శేషారెడ్డి, మేక సుబ్రమణ్యం, ఉల్లపు రవి, తల్లాడ సంజయ్, మాచవరపు నాగేంద్ర, ఉల్లపు నాగేశ్వరరావు, నీలపాల అనిల్, దిగమర్తి శివ, కత్తి వసంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేగా కంభం విజయరాజుని, ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్‌ని గెలిపించాలని అభ్యర్థించారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పోల్నాటి రాజా, పోల్నాటి నాని, పత్తిపాటి రాజారావు, బల్లే చంద్రరావు, పోల్నాటి మధు పాల్గొన్నారు.

శ్రామికుల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యత

మేడే వేడుకల్లో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: రాష్ట్ర ప్రభుత్వం శ్రామికుల అభ్యున్నతికి పెద్ద పీట వేసిందని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత పేర్కొన్నారు. మండలంలోని వెంకటకృష్ణాపురంలో బుధవారం అట్టహాసంగా నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్న మంత్రి వనిత ముందుగా కేక్ కట్‌చేసి, మహిళా కార్మికులకు తినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రామికుల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, ఘంటా విఘ్నేశ్వరరావు, యలమర్తి గాంధి, సర్పంచ్ కామిరెడ్డి శ్రీను, చెరుకూరి ప్రసాదరావు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, నార్ని నాగన్న, పాకలపాటి భాస్కరరావు, కొత్తపల్లి రమేష్, ముక్క రామన్న, పెండ్లి శ్రీను, విజయ్, కేతా కోటేశ్వరరావు, జిత్తుక వెంకటేశ్వరరావు, జిత్తుక కొండయ్య, యోహాను, యాదాల శ్రీను, మల్లయ్య, నాగార్జున తదితరులున్నారు.

వేతన చట్టాలను సక్రమంగా వినియోగించుకోవాలని

చింతలపూడి: కార్మికులు వేతన చట్టాలను, పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపు నిచ్చారు. మేడే సందర్భంగా బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చింతలపూడి పాత బస్టాండ్ సెంటర్‌లో మేడే ఉత్సవాలను నిర్వహించారు. జెండా స్థూపం వద్ద పతాకావిష్కరణ చేశారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు తొర్లపాటి బాబు, కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, న్యాయవాదులు పాల్గొన్నారు. కోర్టు పరిధిలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పతాకావిష్కరణ చేశారు.

జంగారెడ్డిగూడెంలో

జంగారెడ్డిగూడెం: మేడే సందర్భంగా బుధవారం జంగారెడ్డిగూడెంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ, న్యాయవాది యు.ఏసుబాబు, కొప్పిశెట్టి వెంకట సూరిబాబు, మంచిలి రాజు, కె.సుబ్బారావు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఆఫీస్ బుట్టాయిగూడెం రోడ్డు ఏలూరు రోడ్డులోని ప్రజా సంఘాల స్తూపాల వద్ద బుధవారం మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణలు చేశారు. బుట్టాయిగూడెం ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎస్కే సుభాషిని, పి.సూర్యారావు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం కామ్రేడ్ ధర్మన్న భవనం వద్ద మే డే జెండాను ఎగరేసి మేడే వేడుకలు నిర్వహించారు.



ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురంలో కేక్ కట్ చేసి మహిళా కార్మికులకు తినిపిస్తున్న తానేటి వనిత

ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో..

పోలవరం రూరల్: మేడు సందర్భంగా ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోలవరం మండలం జిళ్ళేళ్ళగూడెం పంచాయతీ పరిధిలోని రెడ్డినాగంపాలెం, గిన్నేపల్లి గ్రామంలో ఆ పార్టీ నాయకులు జెండా ఎగురవేశారు. ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాష, మేడే ప్రాధాన్యత వివరించారు. సవలం రాంబాబు, మండు యర్రంరెడ్డి పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో ర్యాలీ

కొయ్యలగూడెం: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా బుధవారం మండల వ్యాప్తంగా కార్మిక, కర్షక, శ్రామిక రంగాలకు చెందిన శ్రేణులు వేడుకలు నిర్వహించారు. కొయ్యలగూడెంలోని సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పతాకావిష్కరణ చేశారు.